RNI. No. APTEL/2011/41055







# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక







సంపుటి : 15 సంచిక : 185 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 7 జనవరి 2026 పేజీలు : 4 వెల : 2/-

# ఆదివారం సెలవు లేదు!

## ఫిబ్రవరి 1నే కేంద్ర బడ్జెట్..




## తొలిసారి ఆదివారం నాడు బడ్జెట్!!

భారత పార్లమెంటరీ చరిత్రలో తొలిసారి ఒక విశేషం నమోదు కాబోతుంది. ఇప్పటికే 8 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలిచిన క్రమంలో.. మరో అరుదైన రికార్డ్ కు ఆమె సిద్ధమయ్యారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఆమె 9వ సారి పద్దును ప్రవేశ పెట్టబోతున్నారు. అది కూడా ఆదివారం నాడు ఈ సారి బడ్జెట్ ఉభయ సభల ముందుకు రానుంది. 2026-27ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను పార్లమెంటరీ సంప్రదాయాల ప్రకారం ఫిబ్రవరి 1నే ప్రవేశపెట్టబోతున్నారు. 2017 నుంచి ఈ సంప్రదాయం ప్రారంభమైంది. సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీలో పెద్ద మార్పును 2017 లో చేశారు. అంతకు, సాధారణ బడ్జెట్ ఫిబ్రవరి చివరి రోజున ప్రవేశపెట్టేవాళ్లు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం నుంచి వచ్చే నిధులను అంచనా వేసి ఆయా రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టడానికి ఆలస్యమవుతుంది కేంద్రం భావించి తేదిని మార్చింది.

కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మొదటి మూడు నెలల ఖర్చులకు ప్రభుత్వం అనుమతి పొందేది. అయితే, మొత్తం సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు తర్వాత ఆమోదం లభించేది. 2017 నుంచి నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని ప్రారంభించారు. దీంతో మార్చి చివరి నాటికి బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం పొందేది.

**ఎలాంటి మార్పు లేదు..** ఈ సారి కూడా పార్లమెంట్ లో బడ్జెట్ ఫిబ్రవరి 1నే ఉభయ సభల ముందుకు రానుంది. బడ్జెట్ సమావేశాలకు సంబంధించి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమై దీనిపై తుది నిర్ణయం తీసుకుంది. జనవరి 31న బడ్జెట్ సమావేశాలు ప్రారంభ కాబోతున్నాయి. అదే రోజు రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. అనంతరం ఫిబ్రవరి 1న లోక్ సభ, రాజ్యసభల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 సంవత్సరానికి సంబంధించి వార్షిక పద్దును ప్రవేశపెడతారు.

**దేశ చరిత్రలో తొలిసారి ఆదివారం..** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఈ సారి తన తొమ్మిదో బడ్జెట్‌ను సమర్పించబోతున్నారు. ఇది దేశ చరిత్రలో ఓ కీలక మైలురాయి. అయితే ఆదివారం సెలవు దినం కావడంతో పాటు ఆ రోజున గురు రవిదాస్ జయంతి కూడా ఉండటంతో తేదీ మార్పుపై ఊహాగానాలు నెలకొన్నాయి. వాటిని ఖండిస్తూ.. అధికారిక ప్రకటన విడుదలైంది. భారత పార్లమెంటరీ చరిత్రలో బడ్జెట్‌ను గతంలో శనివారాల్లో ప్రవేశపెట్టిన సందర్భాలు ఉన్నాయి 2020లో, 2025లో శనివారం పద్దును ప్రవేశపెట్టారు. కానీ ఆదివారం నాడు బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇప్పటి వరకు జరగలేదు. కాగా దేశ చరిత్రలో తొలిసారి ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు నిర్మలమ్మ.




## సోనియా గాంధీకి అస్వస్థత.. ఆస్పత్రిలో అడ్మిట్..

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని.. శ్వాస సంబంధిత సమస్యలతో ఆమె ఇబ్బంది పడుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో వాయు కాలుష్యం భారీగా పెరిగిపోయింది. శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోనియా గాంధీ కూడా చాలా కాలంగా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్ పెరిగిన ప్రతి సారి ఆమె ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు కూడా ఢిల్లీలో చలి తీవ్రత పెరగడం, పొల్యూషన్ కూడా భారీగా పెరగడంతో సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. సోమవారం సాయంత్రం ఆమె ఆస్పత్రిలో చేరారు. రొటీన్ చెకప్‌లో భాగంగానే సోనియా గాంధీ ఆస్పత్రిలో చేరినట్లు హాస్పిటల్ సిబ్బంది చెబుతున్నారు. ఢిల్లీలో పొల్యూషన్ ఎక్కువగా ఉన్న సమయంలో సోనియాగాంధీ రెగ్యులర్ చెకప్‌ల కోసం క్రమం తప్పకుండా ఆస్పత్రికి వస్తారని అధికారులు తెలిపారు.

## విజయ్ ను లాగేసే పనిలో అమిత్ షా.. తమిళనాట సరికొత్త రాజకీయం

తమిళనాడులో దశాబ్దాలుగా పాతుకుపోయిన ద్రావిడ రాజకీయాలకు సవాల్ విసిరేలా అమిత్ షా తాజా పర్యటన సాగింది. ఒకవైపు అధికార డీఎంకే, మరోవైపు ప్రధాన ప్రతిపక్షం ఏఐఏడీఎంకే మధ్య నలుగుతున్న తమిళ రాజకీయాల్లోకి మూడో ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది. ఈ క్రమంలోనే నటుడు విజయ్ రాకను బీజేపీ ఒక అవకాశంగా మలుచుకోవాలని చూస్తోంది.

**ద్రావిడ కోటకు బీటలు వేసే 'షా' వ్యూహం...** బీజేపీ అగ్రనేత అమిత్ షా తన పర్యటనలో రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. కేవలం హిందూత్వ కార్డుతోనే కాకుండా.. యువతలో విపరీతమైన క్రేజ్ ఉన్న విజయ్ వంటి నేతలను కలుపుకొని వెళ్లడం ద్వారా ద్రావిడ పార్టీల ఓటు బ్యాంకుకు గండి కొట్టవచ్చని బీజేపీ యోచిస్తోంది. యువత, తటస్థ ఓటర్లను ఆకర్షించేందుకు ఈ ప్లాన్ చేస్తోంది.. ఎన్డీఏ కూటమిని విస్తరించి విజయ్ ను కీలక భాగస్వామిని చూస్తోంది.

**మెల్లగా మెత్తబడుతున్న విజయ్?...** విజయ్ తన రాజకీయ ప్రవేశంలో బీజేపీ, డీఎంకే రెండింటినీ విమర్శించారు. అయితే రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు ఉండవన్నది అనుభవజ్ఞుల మాట. అమిత్ షా పర్యటన తర్వాత బీజేపీ అధిష్టానం విజయ్ టీమ్‌తో టచ్‌లోకి వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. విజయ్ మాత్రం తన పార్టీ స్వతంత్రతను కాపాడుకోవాలని భావిస్తున్నారు.

పొత్తు జరిగితే అది కేవలం సీట్ల సర్దుబాటుకే పరిమితమవుతుందా? లేక అధికార భాగస్వామ్యానికి దారితీస్తుందా? అన్నది కీలక ప్రశ్నగా మారింది. బీజేపీతో కలిసి వెళ్తే విజయ్‌కు జాతీయ స్థాయిలో మద్దతు లభించే అవకాశం ఉంది. అయితే తమిళనాడులో బలమైన ద్రావిడ సెంటిమెంట్ కారణంగా మైనారిటీ, సెక్యులర్ ఓట్లపై ప్రభావం పడే ప్రమాదమూ ఉంది. ఈ రెండింటినీ తూకం వేసుకుంటూ విజయ్ ఆచితూచి అడుగులు వేస్తున్నారని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.


**ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్?...** ఢిల్లీ పెద్దలతో విజయ్ భేటీ కాబోతున్నారనే ప్రచారం జోరందుకుంది. ఒకవేళ పొత్తు కుదిరితే విజయ్ ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడానికి కూడా బీజేపీ వెనకాడకపోవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తద్వారా అన్నాడీఎంకే ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకోవచ్చని కమలనాథుల లెక్క.



**భవిష్యత్తు ఏంటి?...** ప్రస్తుతానికి విజయ్ ఒంటరిపోరు అని చెబుతున్నా.. అమిత్ షా మార్క్ రాజకీయ చాణక్యం ముందు ఆయన ఎంతకాలం నిలబడుతారనేది ఆసక్తికరం. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి తమిళనాడులో డీఎంకే కూటమి వర్సెస్ ఎన్డీఏ విజయ్ తో కలిపి అన్నట్లుగా పోరు మారే సూచనలు కనిపిస్తున్నాయి. అమిత్ షా వ్యూహాలు, విజయ్ క్రేజ్ కలిస్తే తమిళనాడులో కొత్త చరిత్ర లిఖించబడుతుందా? లేక ద్రావిడ భావజాలం ముందు ఈ కొత్త ప్రయోగాలు విఫలమవుతాయా? అన్నది కాలమే నిర్ణయించాలి.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

## పింఛన్ల పెంపుపై ప్రభుత్వం గుడ్ న్యూస్..



## ఆసరా పింఛన్ల పెంపు!... ముందుగా వారికే...!

హైదరాబాద్ : దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీలను అమలు చేయడమే లక్ష్యంగా.. ఆసరా పింఛన్ల పెంపుతో పాటు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. ఈ క్రమంలోనే ముఖ్యంగా దివ్యాంగులకు నెలకు రూ. 6,000 పింఛన్ అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మేరకు వృద్ధులు, ఇతర వర్గాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 2,016 పింఛన్‌ను రూ. 4,000కు, అలాగే దివ్యాంగులకు ప్రస్తుతం అందుతున్న రూ. 4,016 పింఛన్‌ను రూ. 6,000కు పెంచే దిశగా ఆర్థిక శాఖతో కలిసి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని

**ఆర్థిక శాఖ ప్రణాళిక..** ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, ఇతర వర్గాలకు ఇస్తున్న రూ. 2,016 పింఛన్‌ను రూ. 4,000కు, దివ్యాంగులకు అందుతున్న రూ. 4,016 పింఛన్‌ను రూ. 6,000కు పెంచే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఆర్థిక శాఖ ప్రణాళికల మేరకు ముందుగా దివ్యాంగులకు పెంపు అమలు చేసి, ఆ తర్వాత దశలవారీగా మిగిలిన వర్గాలకు వర్తింపజేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పింఛన్లతో పాటు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే అంశంపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

**44 లక్షల మంది..** హైదరాబాద్ మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 44 లక్షల మంది వివిధ వర్గాల ప్రజలు ఆసరా పింఛన్లను పొందుతున్నారని గుర్తు చేశారు. పింఛన్లతో పాటు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే అంశంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో చర్చించామని, త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుళ్లి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

**మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం..** విద్యా రంగంలోనూ కీలక మార్పులు రానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంధులు, బధిర విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఇప్పటివరకు పదో తరగతి వరకే పరిమితమైన బ్రెయిలీ లిపి పుస్తకాలను ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయి వరకు విస్తరించనున్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా దాదాపు 8 వేల మందికి ఉచితంగా సహాయక పరికరాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. అంతేకాకుండా, దివ్యాంగ జంటల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకంతో పాటు అదనంగా మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కొత్తగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు గ్రామ సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ చర్యలు అమలైతే రాష్ట్రంలోని లక్షలాది దివ్యాంగ కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద ఊరట లభించనుందని ప్రభుత్వం భావిస్తోంది.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# 'సాఫ్ట్ స్కిల్స్'..
## ఏఐ యుగంలో విజయానికి ఇదే కీలకం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఉద్యోగులు, విద్యార్థులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ కీలక సమయంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ మాట్ గార్మన్ యువతకు ఒక విలువైన సలహా ఇచ్చారు. భవిష్యత్తులో విజయానికి కేవలం సాంకేతిక (టెక్నికల్) జ్ఞానం మాత్రమే కాక సాఫ్ట్ స్కిల్స్ అత్యంత అవసరం అని నొక్కి చెప్పారు. గార్మన్ అభిప్రాయం ప్రకారం.. ఏఐ టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా.. మానవులకు మాత్రమే సొంతమైన కొన్ని సామర్థ్యాలను యంత్రాలు అనుకరించలేవు. అవేంటంటే.. క్రిటికల్ థింకింగ్.. క్లిష్టమైన సమస్యలను విశ్లేషించడం, లోతైన ఆలోచనతో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఏఐతో సాధ్యం కాదు. అడాప్టబిలిటీ అవసరం. మారుతున్న పరిస్థితులకు, కొత్త టెక్నాలజీలకు త్వరగా అలవాటు పడగల సామర్థ్యం అవసరం.. కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడం, ఇతరులతో సమర్థవంతంగా సంభాషించడం ముఖ్యం.. గార్మన్ ఇదే విషయాన్ని చెబుతూ "మానవుల ఆలోచనా సామర్థ్యం, క్రియేటివ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, వివేకంతో కూడిన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం మాత్రం యంత్రాలు చేయలేవు." అందుకే యువత ఏ విభాగంలో చదువుతున్నా, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

**మానవీయ నైపుణ్యాల ప్రాధాన్యత...**

అనేక సంస్థలు తమ కస్టమర్లతో మానవీయంగా మాట్లాడగలిగే.. వారి భావనను పంచుకోగలిగే వ్యక్తులను కోరుకుంటాయి. ఏఐ యుగంలోనూ ఈ మానవీయ నైపుణ్యాలు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉంటాయని అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ స్పష్టం చేశారు.

**జోహో కార్ప్ కూడా అదే సూచన...**

ఈ అభిప్రాయాన్ని జోహో కార్పొరేషన్ ఏఐ రీసెర్చ్ చీఫ్ రాంప్రకాశ్ రామమూర్తి కూడా బలపరిచారు. ఇంటర్నెట్ వచ్చినప్పుడు ఉద్యోగాల రూపురేఖలు మారినట్లే, ఇప్పుడు ఏఐ కారణంగానూ ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ రీసనింగ్, క్రిటికల్ థింకింగ్ వంటి నైపుణ్యాలలో మానవులకే ఎప్పటికీ ఆధిక్యం ఉంటుందని తెలిపారు. మానవ మేధస్సు ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏఐ సాంకేతికత అగ్రస్థానంలో ఉన్నప్పటికీ.. ఉద్యోగాలను భద్రపరుచుకోవాలంటే టెక్నాలజీ నైపుణ్యాలకు తోడు మానవీయ నైపుణ్యాలు, లోతైన ఆలోచనా శక్తి, సమస్య పరిష్కార దృక్పథం అత్యంత అవసరం. భవిష్యత్తులో విజయవంతం కావాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ 'సాఫ్ట్ స్కిల్స్'పై దృష్టి సారించడం తప్పనిసరి.

# బోరుంది..మోటారు ఏమైంది..?



సూర్యాపేట : మోటారు లేకుండా వృథాగా కనిపిస్తున్న ఈ బోరు నూతనకల్ మండలంలోని ఓ గ్రామంలోనిది. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో నూతనంగా ఎన్నికైన సర్పంచి ప్రజలకు నీటికష్టాలు రావొద్దనే ఆలోచనతో వినియోగంలోని లేని బోర్లను, బావులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో దాదాపు మూడు విద్యుత్తు మోటార్లు పంచాయతీలో కనిపించకపోవడంతో విస్మయానికి గురయ్యారు. గ్రామపంచాయతీల్లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన పాలకవర్గాలు అభివృద్ధి పనులపై దృష్టిసారించాయి. ఈ క్రమంలో అనేక పంచాయతీలకు చెందిన వస్తుసామగ్రి అదృశ్యం అయిన విషయాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా తాగునీటి సరఫరాకు ఉపయోగించే విద్యుత్తు మోటార్లు కనిపించడం లేదనే ప్రచారం జరుగుతోంది.

అదనపు భారం: జనాభా ప్రాతిపదికన ఒక్కో గ్రామంలో నాలుగు నుంచి ఆరు వరకు, పెద్ద ఊర్లైతే దాదాపు 15 మేర బోర్లు, బావులు ఉన్నాయి. వీటిలో రెండు, మూడు వనరుల విద్యుత్తు మోటార్లు అదృశ్యమవడంతో నీటి సరఫరా ప్రధానమని గుర్తించిన సర్పంచులు అదనపు భారమైనా కొత్త మోటార్లు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలోని మూడు గ్రామాల్లో తాగునీటి బోర్ల మోటార్లు పక్కదారి పట్టినట్లు విమర్శలు వస్తున్నాయి. ఇదొక్క మండలంలోనే కాదు.. ఇంకా బయటపడని గ్రామాలు జిల్లాలో చాలా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా గ్రామపంచాయతీ అధికారులు మాత్రం అందుబాటులోనే ఉన్నాయని చెబుతుండటం గమనార్హం.

ప్రధానంగా తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని పలు మండలాలకు కొద్ది రోజులుగా మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలవడంతో సర్పంచులు ఊళ్లలో గతంలో ఉన్నటువంటి నీటి వనరులను వినియోగంలోకి తీసుకొస్తున్నారు. ఈ తరుణంలో కొన్ని పంచాయతీల్లోని రికార్డుల్లో మోటార్లు ఉన్నట్లు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో అవి కనిపించకపోవడంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. మరమ్మతుల పేరుతో బయటకు తీసుకెళ్లి తిరిగి అమర్చలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పంచాయతీ అధికారులు సమగ్ర విచారణ చేస్తే అసలు విషయం బయటికి వస్తుందని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి యాదగిరిని వివరణ కోరగా అలాంటి విషయం తమ దృష్టికి రాలేదన్నారు. ఎక్కడైతే మోటార్లు కనిపించడం లేదో అక్కడ విచారణ చేయిస్తామని చెప్పారు

# నేలవాలిన నేత్రం.. నిఘా నామమాత్రం



ఆత్మకూరు : 'ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం..' పోలీసు అధికారులు తరచూ చెప్పే మాట ఇది. అవే కేసుల ఛేదనలో కీలకంగా మారుతాయి. ఆత్మకూరు(ఎం) మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా.. మండల కేంద్రంతో పాటు ప్రధాన గ్రామాల్లో 2018లో దాతల సాయంతో సుమారు 125 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 25 పని చేస్తుండగా, మిగతావి అలంకార ప్రాయంగా మారాయి. పోలీసు శాఖ మరో 104 సీసీ కెమెరాలను నేను సైతం కింద అమర్చగా ఇవి కూడా పనిచేయడం లేదు.

గత ఏడాది మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఉన్న కిరాణం, బైక్ మెకానిక్, వైన్స్, రాంనగర్‌లోని కిరాణ దుకాణంలో చోరీలు జరిగాయి. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను పోలీసులు గుర్తించలేక పోయారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై 2018 నుంచి పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించారు. వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట సుమారు 1600 కెమెరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ, మరమ్మతులు లేక కొద్ది నెలలకే పనిచేయడం లేదు. కోతుల బెడద, ఈదురు గాలులకు చాలాచోట్ల తీగలు తెగిపోయి వెయ్యి కెమెరాలు, దృశ్యాలను నిక్షిప్తం చేసే హెచ్‌డీఆర్‌లు పనిచేయడం లేదు. జిల్లాలో గత కొంతకాలంగా జరిగిన నేరాల్లో నిందితులను గుర్తించేందుకు పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని పరిస్థితిని 'న్యూస్‌టుడే' పరిశీలించింది. ఆలేరు మండలంలో ఐదేళ్ల క్రితం 16 పంచాయతీల పరిధిలో 155 కెమెరాలు ఏర్పాటు చేశారు. మొదట్లో వీటి పనితీరు బాగానే ఉన్నప్పటికీ.. రెండు సంవత్సరాల నుంచి నిర్వహణ, మరమ్మతులు లేక పనిచేయడం లేదు. టంగుటూరుతో పాటు మరో రెండు గ్రామాలలో మినహా మిగతా గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

వలిగొండ, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారుల్లో దాతల సౌజన్యంతో 125 సీసీ కెమెరాలకు పైగా ఏర్పాటు చేయగా.. సగానికిపైగా పనిచేయడం లేదు.

మోటకొండూరు మండలంలోని చాడ, ఇక్కుర్తి, మాటూరు, తేర్యాల గ్రామాల్లో దాతలు ఏర్పాటు చేసిన కెమెరాలు వృథాగా ఉన్నాయి.

బొమ్మలరామారం, చీకటిమామిడి, రంగాపూర్, రాంలింగంపల్లి, జలాల్‌పురం, మేడిపల్లి, చౌదర్‌పల్లి, హాజీపూర్‌లో దాతల సౌజన్యంతో ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు మూలన పడ్డాయి.

**ఛేదించారు ఇలా..**

2025 డిసెంబరులో భువనగిరి మండలం వడపర్తిలో ఓ రైతుకు చెందిన మంద నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కొన్ని గొర్రెలను అపహరించారు. అక్కడి సీసీ కెమెరాల ఆధారంగా దొంగను కనిపెట్టి గొర్రెలను రైతుకు అప్పగించారు. 2025 డిసెంబరులో స్వరగిరిలో చిన్నారి చేతి నుంచి బంగారు గాజును చోరీ చేసిన దుండగుడిని సీసీ కెమెరా ఆధారంగా గుర్తించారు. గాజును బాధితులకు అప్పగించినట్లు గ్రామీణ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

బీబీనగర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

బీబీనగర్ : బీబీనగర్ ప్రధాన మార్గాలు, కూడళ్లలో సీసీ కెమెరాలున్నా పనిచేయడంలేదు. పోచంపల్లి చౌరస్తా, బీబీనగర్ ఎయిమ్స్ వద్ద తరచూ ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఆరు వాహనాలు చోరీకి గురయ్యాయి. ప్రజల విన్నపం ఏమనగా: సీసీ కెమెరాలకు మరమ్మతులు నిర్వహించి..సక్రమంగా నిర్వహణ చేపట్టాలి.

# గందరగోళం.. ఇష్టారాజ్యం


కరీంనగర్ : అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో కనిపించిన తప్పులే నగర పాలక సంస్థ ఎన్నికల ఓటర్ల జాబితాలో కనిపించాయి. ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించారు. శుక్రవారం నుంచి ఆశావహులు, రాజకీయ పార్టీల నాయకులు ఆ జాబితాలను పరిశీలించడం మొదలుపెట్టారు. ఇంటినంబర్లు, పోలింగ్ స్టేషన్ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయగా నగర ఓటర్లే కాకుండా మంథని, జగిత్యాల, సిద్దిపేట, గంభీరావుపేట, హిమాయత్‌నగర్, జీడిమెట్ల వంటి ప్రాంతాల వారి పేర్లు ఆయా పోలింగ్‌స్టేషన్ల పరిధిలోని జాబితాలో కనిపిస్తున్నాయి.

కొత్త వారు.. అవగాహన లేక

నగరపాలక సంస్థ కార్యాలయంలో డివిజన్ల వారీగా బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు ఉండగా అంతా కొత్తగా నియామకమైన వారున్నారు. డివిజన్ల ఇంటి నంబర్లపై పట్టు లేకుండా పోయింది. పట్టణ ప్రణాళికలోనూ ఇలాగే కొత్త వారు కావడంతో ఇంటినంబర్లతో అనుసంధానం చేయడం ఇబ్బందులకు గురి చేసింది. ఇంటి నంబర్ల ప్రకారం చూడటంతో ఒక డివిజన్‌లోని ఓటర్లు మరో డివిజన్‌లోకి చేర్చారనే విమర్శలు వస్తున్నాయి.

ఒకే పోలింగ్ కేంద్రంలోనే..

సాధారణ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు దూరంగా వేశారు. ఎక్కువ శాతం ఓటర్లు దూరభారంతో ఓటు వేసేందుకు ఆసక్తి చూపించలేదు. పుర ఎన్నికల్లో మాత్రం ఇంటి నంబర్ల ఆధారంగా సమీపంలో పోలింగ్ కేంద్రం ఉండేలా, దాని పరిధిలోని కుటుంబం మొత్తం ఓటర్లు ఉండేలా జాబితా తయారు చేశారు.



వీరంతా ఎక్కడి నుంచి వచ్చారో..

8వ డివిజన్ అలుగునూర్ ప్రాంతంలోని ఓటర్ల జాబితాలో గాంధీనగర్, కొత్తపల్లి, రేకుర్తి, హిమాయత్‌నగర్, కల్వచర్ల, వీణవంక, తిమ్మాపూర్, అశోక్‌నగర్ ఓటర్లు కనిపిస్తున్నారు.

28వ డివిజన్‌లోని ఇంటినంబర్ల ఓటర్లు కాకుండా ఇతర ప్రాంతాల ఇంటి నంబర్లు జాబితాలో చేరాయి. ఇలా సుమారు 460 ఓటర్ల వివరాలు వేరుగా ఉన్నాయి. 31వ డివిజన్‌లో ఇం.నం.1-1-68 ఓటర్లు చేరారు. వీరంతా పాత డివిజన్ మేదరివాడలో ఉండాల్సింది కొత్త జాబితాలో అలాగే ఉన్నారు. హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పురపాలికల పరిధిలోనూ వార్డుల ఓటరు జాబితా పరిశీలిస్తే కరీంనగర్ ఓటర్లు ఉన్నారు.

డివిజన్లు : 66 మొత్తం ఓటర్లు: 3,40,775 పురుషులు : 1,69,763
మహిళలు : 1,70,969 ఇతరులు : 43

# మమకారం కురిపిస్తే కారాగారమే..!

కొత్తగూడెం : మా అబ్బాయి చిన్నపిల్లోడే కానీ.. ద్విచక్రవాహనం సూపర్‌గా నడుపుతాడు.. మా బాబు అలా.. ఇలా.. అంటూ గొప్పలకు పోయి లేనిపోని మమకారం ఒలకబోసి మైనర్లకు వాహనాలు ఇస్తే ఇకమీదట చెల్లుబాటయ్యే పరిస్థితులు లేవు సుమీ..! వల్లమాలిన ప్రేమతో మైనర్ల చేతికి వాహనాలు అప్పగించి హద్దులు దాటితే పెద్దలు కటకటాలపాలవటం ఖాయం. జిల్లా పోలీసులు ఈ విషయంపై ఈ ఏడాదిలో చట్టాన్ని పటిష'ంగా అమలుచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈమేరకు పోలీసు యంత్రాంగానికి ఎస్పీ బి.రోహిత్‌రాజు ఇప్పటికే సూచనలు చేశారు.

మైనర్లకు ఎలాంటి అర్హత లేకపోయినా ద్విచక్రవాహనాలపై విన్యాసాలు చేస్తుంటారు. రోడ్డు ప్రమాదాలు అదేస్థాయిలో విపరీతమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ క్రతువులో భాగంగా పోలీసు యంత్రాంగం ఈ దిశగా అడుగులు వేస్తుంది. ఇక మీదట మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కితే సంబంధిత ఇళ్లల్లో పెద్దవారిపై కేసులు



నమోదుచేయనున్నారు. అవసరమైతే పెద్దల లైసెన్సులను రద్దు చేయటానికి వెనుకాడే పరిస్థితులు లేవని హెచ్చరిస్తున్నారు.

పిల్లలు బాగానే వాహనం నడుపుతారనే ధీమాతో మార్కెట్ లేదా కళాశాలలకు పంపించినా తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవ్వాల్సి వస్తుంది. ఇకపై వాహనాలు ఇచ్చేముందు ఒకటికి పదిసార్లు ఆలోచించుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు నడిపే మైనర్లను నియంత్రించేందుకు 2024 నుంచే క్రతువును పోలీసులు ఆరంభించారు. అందులో భాగంగానే డ్రంకన్‌డ్రైవ్, ఈ-చలానా కేసులను విపరీతంగా పెంచుతూ వచ్చారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు 2024తో పోల్చితే 2025లో 24శాతం పైగా పెరిగాయి. 2026 జనవరి ఆరంభం నుంచే మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించనున్నట్లు తెలిసింది.

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..

భద్రాచలం : భద్రాచలంలో రామాలయ విస్తరణకు సర్వం సిద్ధమైంది. సుమారు మూడున్నర శతాబ్దాల క్రితం రామాలయాన్ని భక్త రామదాసు నిర్మించారు. ఆ తరువాత అనేక మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. నాటి వైభవం చెక్కు చెదరకుండా రెండు ప్రాకారాలతో భక్తుల భవిష్యత్తు అవసరాలు తీర్చేలా విస్తరణ పనులు చేపట్టాలని ఆగమశాస్త్ర పండితులు సూచించారు. బృహత్తర ప్రణాళికకు రూ.350కోట్లకు పైగా అవసరమని ప్రతిపాదించారు. కొద్దిరోజులుగా ఇదే అంశంపై దేవాదాయశాఖ కసరత్తు చేస్తోంది.

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ**

ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి పలుమార్లు భద్రాచలంలో పర్యటించి ఇక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుని బృహత్తర ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైదిక పెద్దలు కీలక సూచనలు చేశారు. అయినా ఎక్కడో తేడా వచ్చినట్లు సమాచారం. భక్త రామదాసు అభీష్టం మేరకు ఆలయాలను నిర్మించాలని సూచిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వైదికులు ఇటీవల లేఖ రాశారు. గవర్నర్ జిషు?దేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఈఓ దామోదర్‌రావు, దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు శ్రీభద్రాచలం సీతారామ అర్చక సంఘం పేరిట వినతిపత్రాలు అందజేశారు.

**వైదిక పెద్దల సూచనలు ఇవిగో..**

భక్త రామదాసు నిర్మించిన విధంగా ఇప్పటి అవసరాల మేరకు రెండు ప్రాకారాలు ఉండాలి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వాటికి పేర్లు పెట్టాలి. ఈ ప్రాకారాల్లోని గుడుల గురించి స్పష్టత అవసరం. నిర్మాణాలన్నింటికీ శంఖు చక్రం తిరునామం తప్పనిసరి.

అధ్యయనోత్సవ, నిత్య కల్యాణ, అమావాస్య, పవిత్రోత్సవ, ఉట్ల, అలంకార, ఏకాదశి, ద్వాదశి, పౌర?మి మండపాలు అవసరం. పంచ కుండాత్మక యాగశాల, విశాలమైన నివేదన వంటశాల నిర్మించాలి. ఆలయ ప్రాకారాల బయట ఈశాన్య భాగాన పుష్కరిణి ఏర్పాటు చేయాలి. పైవంతెన తరహాలో కొన్ని నిర్మాణాలు చేయాలి. గాలి గోపురానికి ఉత్తర, దక్షిణ దిక్కుల్లో విస్తీర?ం సరిపడా ఉండాలి. శ్రీమహాలక్ష్మి, గోదా, రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయాలు, భక్త రామదాసు సన్నిధిని శాస్త్ర ప్రకారం నిర్మించాలి. బంగారం, వెండి రథశాలలు, మ్యూజియం, స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేయాలి. వీటన్నింటినీ గమనిస్తే.. 'వైదిక పెద్దలతో ఆర్కిటెక్ట్ సమావేశమై సలహాలు తీసుకోవాలి. ఆ తరువాతే బృహత్తర ప్రణాళికకు తుది రూపు ఇవ్వాలి. దీనిపై దేవాదాయశాఖ చొరవ చూపాలి' అని అవగతమవుతోంది.

# బోనకల్లు.. సౌర వెలుగుల జల్లు..!

మధిర : ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో గృహజ్యోతి లబ్ధిదారుకు ఉచితంగా సౌరవిద్యుత్ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. రాష్ట్రంలోనే మోడల్ సోలార్ విద్యుత్ మండలంగా బోనకల్లుని ఎంపిక చేశారు. మండలంలో గృహజ్యోతి పథకం కింద లబ్ధిపొందే అన్ని గృహాలకు సోలార్ ప్యానల్స్‌ను ఉచితంగా అమరుస్తున్నారు. శుక్రవారం బోనకల్లులో ఈ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి సమక్షంలో ప్రారంభిం చారు. ప్రధానమంత్రి సూర్యఘర్ విద్యుత్ పథకానికి రాష్ట్రప్రభుత్వం తన వంతు నిధులు జోడించి దీనిని అమలు చేస్తోంది.ఒక్కో లబ్ధిదారుని ఇంటికి రూ.1.40 లక్షల విలువైన నాలుగు ప్యానల్స్‌ని అమర్చుతున్నారు. ఇవి నెలకు 240 యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయనున్నాయి. ఈ విద్యుత్‌ని పొదుపుగా వాడుకుంటే లబ్ధిదారులకు రాష్ట్రప్రభుత్వం గృహజ్యోతిలో ఉచితంగా ఇచ్చే 200 యూనిట్లు పోను మిగిలిన 40కి డిస్కం నుంచి తిరిగి డబ్బులు వచ్చే అవకాశం ఉంది. పూర్తి ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ఏర్పాటు చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఈ నెలాఖరు లోపు అన్ని ఇళ్లకు..ఇప్పటికే గృహజ్యోతి పథకం పొందుతున్న లబ్ధిదారులకు సౌరవిద్యుత్ వరం లాంటిదని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి పేర్కొన్నారు. బోనకల్లులో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటిగా బోనకల్లు మండలం మొత్తం లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా సోలార్ ప్యానల్స్ అమర్చడం జరుగుతోందన్నారు. మండల కేంద్రంలో 960 మంది లబ్ధిదారులను గుర్తించామని, 500 గృహాలకు ఇప్పటికే యూనిట్ పరికరాలను చేర్చామన్నారు. మండలంలోని కొన్ని గ్రామాలకూ పరికరాలను చేర్చినట్లు ఆయన వివరించారు. సోలార్ యూనిట్లను ఉచితంగా లబ్ధిదారుల ఇళ్లకు ఈ నెలాఖరుకు పూర్తిగా అమర్చుతారని వివరించారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఒక్కో గ్రామాన్నే ఈ పథకం కింద ఎంపిక చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ, ఏడీఏలు, ఏఈలు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులకు గ్రహణం

తాండూరు: అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లను బాగు చేయడానికి ఏడాదిన్నర కిందటే రూ.15.20 కోట్లు మంజూరయ్యాయి. పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. కంకర, తారు తొలగి అడ్డదిడ్డంగా మారాయి. వర్షాకాలంలో సవ్యంగా వెళ్లే పరిస్థితి లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పనులు చేయడానికి వాతావరణం అనుకూలంగా ఉన్నా.. వెరూ పట్టించుకోవడం లేదు.

**నిధుల మంజూరు ఇలా..**

తాండూరు మండలం జిన్‌గుర్తి- సంకిరెడ్డిపల్లికి రూ.కోటి, ధారూర్ వాగు సరిహద్దు నుంచి సంకిరెడ్డిపల్లి వరకు రూ.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బిజ్వార్‌కు రూ.61 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోనూరుకు రూ.71 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డునుంచి రాంపూరుకు రూ.41 లక్షలు, పెద్దేముల్ నుంచి పెద్దేముల్ తండాకు రూ.80 లక్షలు, హన్మాపూరు ఎక్స్ రోడ్డు నుంచి జయరాంతండా సరిహద్దుకు రూ.2 కోట్లు, గిర్మాపూరు ఎక్స్ రోడ్డు నుంచి చింతామణిపట్నం, గిర్మాపూరు తండాకు రూ.83.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఖానాపూరుకు రూ.67లక్షలు, యాలాల మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కమాల్‌పూరు, విశ్వనాథ్‌పూరు వరకు రూ.1.75 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తిమ్మాయిపల్లికి రూ.32 లక్షలు, పీడబ్ల్యూడీ దారి నుంచి కమాల్‌పూరుకు రూ.21 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి నాగసమందర్‌కు రూ.71 లక్షలు, కోట్‌పల్లి మండలం అప్రోచ్ రోడ్డు నుంచి ఇందోల్‌కు రూ.35 లక్షలు, బషీరాబాద్ మండలం బషీరాబాద్ నుంచి కొత్లాపూరు, దామర్‌చేడ్‌కు రూ.3.25 కోట్లు, మైల్వార్ నుంచి



కంసాన్‌పల్లి(బి) వరకు రూ.50లక్షలు, పీడబ్ల్యూడీ నుంచి మంథన్‌గౌడ్‌కు రూ.58 లక్షలు మంజూరయ్యాయి.

**17 రోడ్లు.. 34.57 కి.మీ. పొడవు..**

అన్ని మండలాల్లో 17 రోడ్లను బాగు చేస్తే 34.57 కి.మీ. దూరం బాగుపడతాయి. తాండూరు మండలంలో 5, యాలాల మండలంలో 4, బషీరాబాద్ మండలంలో 3, పెద్దేముల్ మండలంలో 4, కోట్‌పల్లి మండలంలో ఒక రోడ్డును బాగు చేయాల్సి ఉంది.

ఉన్నతాధికారులే నిరయం తీసుకోవాలి..

రహదారుల మరమ్మతులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతోనే పనులు కావడం లేదు. ఇప్పటికే ఏడు సార్లు టెండర్లు పిలిచాం. ఒక్కరూ రాలేదు. మరమ్మతుల విషయంలో ఉన్నతాధికారులు తగిన నిర?యం తీసుకోవాల్సి ఉంది.సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఈ

# ఊరిబాగుకు 'ఉపాధి'

పెద్దపల్లి : కోటి ఆశలతో పంచాయతీల్లో పాలకవర్గాలు పగ్గాలు చేపట్టగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉవ్విళ్లూరుతున్న సర్పంచులకు కొన్ని సవాళ్లు ఎదురుకానున్నాయి. పంచాయతీల్లో నిధుల సమస్య వెంటాడుతుండగా ప్రతీ చిన్న పనికి దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పల్లెల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం బాసటగా నిలవనుంది. ప్రస్తుతం ఈ పథకాన్ని మార్చిన కేంద్రం వికసిత్ భారత్ – గ్యారంటీ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (వీబీ–జీ రాం జీ)గా చట్టం చేసినా ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న విషయమై స్పష్టత లేదు.

**కొత్త చట్టం ప్రభావం**

వీబీ జీ రాం జీ చట్టం పనులపై కొంత ప్రభావం చూపనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు కూలీలకు కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులు కేటాయించేది. సామగ్రి వాటాలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం మంజూరు చేసేది. కొత్త చట్టంలో కూలీలకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంది. తాజా విధానంలో కూలీలకు కొంత ఇబ్బంది లేకున్నప్పటికీ సామగ్రి వాటాలో చేసే పక్కా భవనాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఆటంకం కలగనుంది. కొత్త చట్టం అమలుపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

**భూగర్భజలాలకు భరోసా**

గుట్టలు, అటవీ ప్రాంతాల్లో కాంటూరు, సమతల కందకాలు నిర్మిస్తే భూగర్భజలాలు పెరగనున్నాయి. ఆయకట్టు పెంపునకు చెరువులు, కాలువల పూడికతీత, పునరుద్ధరణ పనులు, చెక్‌డ్యాంలు, ఊట కుంటలు నిర్మించుకోవచ్చు.

**266 పనులకు అవకాశం**

గ్రామాల అభివృద్ధి ఎక్కువగా ఉపాధి హామీపై ఆధారపడనుంది. దీని ద్వారా 266 రకాల పనులు చేసుకోవచ్చు.సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కూలీల, పని నిష్పత్తి ఆధారంగా నిధులు కేటాయిస్తున్నారు.



పంట భూములకు ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లేందుకు దారులు నిర్మించుకోవచ్చు.

జనావాసాల్లోని వృథా నీరు రోడ్లపై చేరకుండా మురుగు కాలువల నిర్మాణానికి అవకాశం ఉంది.

పంచాయతీలకు సొంత గూడు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మించుకునే వీలుంది.వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు నిధులు రానున్నాయి.

వన మహోత్సవంలో మొక్కల పెంపకం, బంజరు, బీడు భూముల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చు.

ఉమ్మడి జిల్లా వివరాలు

సొంత భవనాలు లేని పంచాయతీలు : 584

గూడు లేని అంగన్‌వాడీ కేంద్రాలు : 973

పునరుద్ధరణకు నోచుకోని చెరువులు : 2,758

నిర్మించాల్సిన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు : 847 కి.మీ.ల పొడవు

# కోకాపేటలో ఇల్లు కట్టేద్దాం..!




హైదరాబాద్ : కోకాపేటలో ఇల్లు కట్టుకుంటే దర్జాగా ఉండొచ్చన్న అంచనాతో కొందరు ప్రభుత్వ భూములపై కన్నేశారు.సర్కారు స్థలాల్లో గుడిసెలు, చిన్న ఇళ్లు కట్టుకుని క్రమబద్ధీకరించుకున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. వారి పట్టాలను తీసుకుని నకిలీ పట్టాలు సృష్టించి ఇళ్లు కట్టుకుంటున్నారు. 80, వంద గజాల్లో అంతస్తులు నిర్మిస్తున్నారు. అధికారులకు అనుమానం వచ్చి పరిశీలించగా... కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కట్టుకుంటున్నారని తేలింది. కోకాపేటతో పాటు మణికొండలోనూ ఓ వ్యక్తి 60గజాల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టారు.

**దర్జాగా ఆక్రమణలు:** కోకాపేట, పుప్పాలగూడ, మణికొండ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములున్న కొన్ని ప్రాంతాల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు వీటిపై దృష్టిసారించడంతో రియల్ వెంచర్ల ప్రతినిధులు, పేదలకు ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను ఆక్రమించుకోవడం ప్రారంభించారు. తాజాగా కోకాపేటలో నలుగురు వ్యక్తులు సర్వేనంబరు 147లోని 80 గజాల చొప్పున కొన్ని ప్లాట్లకు మార్కింగ్ వేసి ఇళ్లు కట్టుకుంటున్నారు. అధికారులు పట్టాలను పరిశీలించగా... రంగారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వహించిన హరీష్ సంతకంతో జారీచేసిన పట్టాగా ఉంది. ఫోరెన్సిక్ పరీక్ష చేయించగా... హరీష్ సంతకం కాదని తేలింది.

**సమగ్ర సర్వే నిర్వహిస్తాం** గండిపేట్ మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం ఉంది. 60గజాలు, 80 గజాల చొప్పున నాలుగైదు ప్లాట్లను ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలను నిర్మించాలన్నదే వారి ప్రణాళిక. భూములన్నింటినీ పరిశీలించి సమగ్రసర్వే నిర్వహించనున్నాం.ఎన్.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్

# ఒక్క క్లిక్.. వివాదాలకు చెక్



హైదరాబాద్ : ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పట్టణ భూగరిష్ఠ పరిమితి భూములను రక్షించేందుకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం(అర్బన్ ల్యాండ్ సీలింగ్) పరిధిలోని సర్కారు భూముల వివరాలను 'ఈ–కోర్టు–యూఎల్‌సీ ఆర్‌ఆర్' పోర్టల్‌లో నమోదు చేశారు. తాము యూఎల్‌సీ పరిధిలోకి రామని, తమ భూములు ఇప్పించాలంటూ కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఇవన్నీ తప్పేనంటూ రుజువు చేసేందుకు ఈ–కోర్టు పోర్టల్‌లోని ఆధారాలను ట్రిబ్యునల్ కోర్టులు, హైకోర్టులకు రెవెన్యూ అధికారులు సమర్పించనున్నారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, మహేశ్వరం ప్రాంతాల్లో పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టంలో భాగంగా తొమ్మిదివేల ఎకరాలకుపైగా ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎకరా రూ.25కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ పలుకుతోంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఓ రియల్ వెంచర్ సంస్థ ప్రతినిధులు తాము యూఎల్‌సీ పరిధిలోకి రాని భూములను కొనుగోలు చేశామని, నాలా కన్వర్షన్ చేయాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... రెవెన్యూ అధికారులు వారు సమర్పించిన ఆధారాలు సరైనవికావంటూ నిరూపించారు.

**ముందు జాగ్రత్తలు.. డిజిటల్ వివరాలు**

పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం ప్రకారం ప్రభుత్వానికి వచ్చిన భూముల సమగ్ర వివరాలను జియోట్యాగింగ్ ద్వారా డిజిటల్ రికార్డులుగా మార్చారు. యూఎల్‌సీ భూములున్న సర్వేనంబర్లలో స్థలాలు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయా.. ఎవరైనా కోర్టుల్లో ఫిర్యాదులు చేశారా.. వివరాలు ఇందులో పొందుపరిచారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నుంచి కలెక్టర్ వరకూ ఒక్క క్లిక్‌తో వివరాలన్నీ తెలుసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.ప్రజల అవసరాల దృష్ట్యా రక్షణ

రంగారెడ్డి జిల్లాలో భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకుని పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం భూములను కాపాడుకుంటున్నాం. న్యాయస్థానాల్లోని ఫిర్యాదులు, విచారణల సందర్భంగా రికార్డులను సులభంగా చూసుకునేందుకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి. ప్రస్తుతం 900 ఎకరాల భూములపై వివాదాలు కొనసాగుతున్నాయి. పరిష్కరించేందుకు న్యాయస్థానాలకు త్వరలో ఆధారాలను సమర్పించనున్నాం.సి.నారాయణరెడ్డి, కలెక్టర్,రంగారెడ్డి

# అతివలకు ఆదాయ సృష్టి



బొంరాస్‌పేట : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. మహిళా సాధికారత, ఆదాయం పెంపు, పాడి అభివృద్ధే లక్ష్యంగా ఇందిరా డెయిరీ ప్రాజెక్టును చేపట్టాలని నిర?యించింది. ఈ పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రెండు గేదెలు లేదంటే ఆవులు పంపిణీ చేయనుంది. ఈ పథకంతో అతివలకు జీవనోపాధి లభించడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి అవకాశం కలుగుతుంది.

**పెరగనున్న పశుసంతతి, పాల ఉత్పత్తి**

గ్రామాల్లో పశువుల సంఖ్య బాగా తగ్గిపోయింది. వ్యవసాయ పనులు యంత్రాలతో చేయడం, గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు తగ్గి మేతకు కొరత ఏర్పడడంతో పశువులను పెంచుకోవడం తగ్గించారు. దీంతో వాటి సంతతి తగ్గడంతోపాటు పాల ఉత్పత్తి బాగా పడిపోయింది. ప్రభుత్వం అమలు చేసే డెయిరీ ప్రాజెక్టుతో గ్రామాల్లో 31,324 గేదెలు లేదా ఆవుల సంతతి జిల్లాలో అదనంగా పెరుగుతుంది.

**రూ.2 లక్షలతో గేదెలు లేదా ఆవులు..**

ప్రతి మండలాన్ని మూడు జోన్లుగా విభజిస్తారు. పది గ్రామాలను యూనిట్‌గా ఏర్పాటు చేస్తారు. పథకంలో ఒక్కో యూనిట్ ధర రూ.2 లక్షలు. ఇందులో ప్రభుత్వం రూ.1.40 లక్షలు రాయితీ ఇస్తుంది. మిగిలిన రూ.60వేలు బ్యాంకులు రుణంగా అందిస్తాయి. ఈ డబ్బుతో రెండు గేదెలు లేదంటే రెండు ఆవులు కొనిస్తారు. పశువులకు గడ్డి, దాణా సరఫరాను స్థానిక యువతకు అప్పగించి వారికి ఉపాధి కల్పించనున్నారు.

**కొడంగల్‌లో మైనార్టీల కోసం..**

సీఎం నియోజకవర్గం కొడంగల్‌ను ఇందిరా డెయిరీ షీప్ ఫార్మింగ్ పథకానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దీంతో నాలుగు మండలాల్లో 315 మంది మైనార్టీలకు గేదెలు, మేకలు ఇవ్వాలని ప్రభుత్వం నిర?యించింది. వీరికి రూ.2లక్షల యూనిట్ ధరలో రూ.1.60 లక్షలు రాయితీ, రూ.40వేలు బ్యాంకు రుణం ఇస్తుంది. ఇప్పటికే 20 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మిగిలిని వారినీ ఎంపిక చేస్తామన్నారు.

గ్రామపంచాయతీలు: 594

మొత్తం స్వయం సహాయక సంఘాలు: 15,662

గ్రామైక్య సంఘాలు: 657

మండల మహిళా సమాఖ్యలు: 19

సంఘాల్లోని సభ్యులు: 1,63,703

# చెరువులకు సం'క్రాంతులు'

హైదరాబాద్ : నగరంలో ఆక్రమణలకు గురైన చెరువులకు హైడ్రా పునరుజ్జీవం పోస్తోంది. తటాకాలు కొత్త రూపు సంతరించుకున్నాయి. మొదటిదశలో భాగంగా ఆరు కాసారాల్లో సుందరీకరణ చేపట్టారు. ఇప్పటికే బతుకమ్మకుంట పనులు పూర్తయ్యాయి. సంక్రాంతికి పాతబస్తీలోని బమ్ రుఖ్ నుద్దౌలా చెరువు, మాదాపూర్‌లోని తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువుల్లో చేపట్టిన ప్రగతి పనులు పూర్తి కానున్నాయి. వాటి వద్ద ఈ నెల 11 నుంచి మూడ్రోజులపాటు పతంగుల పండగ నిర్వహించేందుకు హైడ్రా ఏర్పాట్లు ప్రారంభించింది.

**ఆక్రమణల నుంచి ఆహ్లాదకరంగా..**

పాత జీహెచ్‌ఎంసీ పరిధిలో 185 చెరువులుండగా.. 95 శాతం



ఆక్రమణకు గురైనవే. పలు తటాకాలకు హైడ్రా విముక్తి కల్పించింది. 14 ఎకరాలకు కుంచించుకుపోయిన తమ్మిడికుంట చెరువు.. ఇప్పుడు 30 ఎకరాల్లో సుందరంగా ముస్తాబవుతోంది. మురుగు కలవకుండా పైపులైన్లు వేశారు. చెరువులోకి వరద సాఫీగా వచ్చేందుకు కాలువలు నిర్మించారు.కూకట్‌పల్లిలోని నల్ల చెరువు విస్తీర?ం 16 ఎకరాలకు పడిపోయింది. ఆక్రమణలను తొలగించి విస్తీరా?న్ని 30 ఎకరాలకు పెంచారు.పాతబస్తీలోని బమ్ రుఖ్ నుద్దౌలా చెరువు 4 ఎకరాల విస్తీరా?నికి పడిపోవడంతో.. దురాక్రమణలను నేలమట్టం చేసి, 17 ఎకరాల్లో పునరుజ్జీవం కల్పించారు.మాదాపూర్‌లోని సున్నం చెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువుల వద్ద అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని హైడ్రా అధికారులు తెలిపారు.

## 3 ప్రాంతాలు

హైదరాబాద్ నగరంలో విలువైన భూములను వేలం వేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) సిద్ధమవుతోంది. ఈ నెలలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బంజారాహిల్స్‌లోని హెచ్‌ఎండీఏకు ఉన్న 8.3 ఎకరాలతోపాటు కొండాపూర్‌లో 20 ఎకరాలను బహిరంగ వేలంలో విక్రయించాలని యోచిస్తోంది. ఇప్పటికే బంజారాహిల్స్‌లోని ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో ప్లాట్లుగా విభజించారు.

**కోకాపేటలో 70 ఎకరాలు**

కోకాపేట సర్వీసు రోడ్డు టోల్ బూత్ పక్కనే హెచ్‌ఎండీఏకు 70



ఎకరాలు ఉంది. ఇప్పటికే వాటిలో మౌలిక వసతులను కల్పించింది. అయితే గతంలో ఈ భూమిని ఎస్‌ఈజడ్ కోసం కొన్ని కంపెనీలకు లీజుకు కేటాయించారు. సంస్థలను ఏర్పాటు చేసేందుకు ఏ కంపెనీ ముందుకు రాలేదు. లీజు గడువు కూడా ముగిసింది. దీంతో ఐటీ ఎస్‌ఈజడ్ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకునేందుకు హెచ్‌ఎండీఏ ఆయా సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. దాదాపు అన్ని కంపెనీలు సానుకూలంగా స్పందించాయని ఉన్నతాధికారి తెలిపారు.

# విద్యార్థి పథం.. సమాజ హితం

నల్గొండ : విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగస్వాములవుతున్నారు. జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొక్కలు నాటడం, మూఢనమ్మకాల నిర్మూలన, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో పలుచోట్ల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఎంజీయూ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ఈ విద్యా సంవత్సరం జనవరి మొదటి తేదీ వరకు 43 శిబిరాలు నిర్వహించారు. ఈ సంఖ్య మార్చి నాటికి 120 వరకు చేరనుంది.

**ఉమ్మడి జిల్లాలో 163 విభాగాలు..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రస్తుతం 163 ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు ఉన్నాయి. మొత్తం 16,300 మంది వాలంటీర్లు ఉన్నారు. ఒక్కో విభాగంలో 100 మంది విద్యార్థుల చొప్పున ఉన్నారు. ప్రతిఏటా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే శిబిరం నిర్వహణకు ఒక్కో విభాగానికి కేంద్ర ప్రభుత్వం రూ.35,000 మంజూరు చేస్తుంది.



**విస్తృతంగా కార్యక్రమాలు**డా.మారం వెంకటరమణారెడ్డి, ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్‌నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో విస్తృతంగా ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు శిబిరాలను సందర్శించి వాలంటీర్లు చేసే సేవా కార్యక్రమాలను పరిశీలిస్తున్నాం. మార్చి నాటికి 163 ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల్లో 120కి పైగా శిబిరాలు నిర్వహించేలా కృషి చేస్తాం.వాలంటీర్లకు ఉన్నత విద్య, పలు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఉంటుంది. రానున్న రోజుల్లో ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేస్తాం.

**నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి**

గీత, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ కాకతీయ డిగ్రీ కళాశాల

నాకు చిన్నప్పటి నుంచి సమాజ సేవ అంటే ఎంతో ఇష్టం. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే శిబిరంలో పాల్గొన్నా. శ్రమదానం, మొక్కలు నాటడం, బాల్యవివాహాలు, మూఢనమ్మకాల నిర్మూలన, అంటువ్యాధులు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాం. శిబిరంలో పాల్గొనడం ద్వారా కలిసి పనిచేసేతత్వం ఏర్పడింది. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందాయి.



# అసెంబ్లీపై కేటీఆర్ హాట్ కామెంట్స్..

జనగామ, జనవరి 6: తెలంగాణ అసెంబ్లీ నడుస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ గౌరవ సభ కాదని.. కౌరవ సభ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శాసనసభ బూతుల సభగా మారిందని మండిపడ్డారు. మంగళవారం నాడు జనగామలో పర్యటించిన కేటీఆర్.. పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. ꞉కుటుంబం అన్నాక గొడవలు ఉంటాయని.. అలుగుడు గులుగుడు ఉంటది, సర్దుకుపోవాలన్నారు. లేదంటే.. కాంగ్రెస్ వాళ్లకు సందు దొరుకుతది꞉ అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి నిస్సిగ్గుగా ఇచ్చిన హామీలన్నింటినీ మర్చిపోయారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌ను ఉరి తీయాలని రేవంత్ రెడ్డి అన్న కామెంట్స్‌ని ప్రస్తావించిన కేటీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణను తెచ్చినందుకు కేసీఆర్‌ను ఉరి తీయాలా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రైతుల అవస్థలను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. యాప్‌అబ్రీశ్రీలో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటూ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ లీడర్ కాదని.. రీడర్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వరంగల్‌లో రైతులకు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను మరిచిన రాహుల్ గాంధీని ఉరితీయాలని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.



# హైదరాబాద్-విజయవాడ హైవేపై ఎన్నాళ్లీ విస్తరణ పనులు?

**హైదరాబాద్-విజయవాడ రహదారిపై ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. కారణం.. మూడేళ్ల క్రితం చేపట్టిన ఆరు లేన్ల విస్తరణ పనులు నత్త నడకన సాగతుండటమే! అనేక చోట్ల పనులు అసంపూర్తిగా వదిలేయడంతో నగరంలో పనామా కూడలి నుంచి అబ్దుల్లాపూర్ మెట్ వరకు ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. ఈ మార్గంలో రోడ్డు దాటడానికి ప్రజలు బెంబేలిత్తిపోతున్నారు. ఈ రహదారిపై ప్రమాదాల బారిన పడి పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం మరింత ఆందోళన కలిగిస్తోంది.**




హైదరాబాద్: కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. తెలంగాణ శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు. "ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీలను తక్కువగా వినియోగిస్తున్నారు. రాష్ట్రం మొత్తంపై ఆ తరహా వాహనాలు 70 వేలే నడుస్తున్నాయి. కాలుష్యం తగ్గాలంటే ఈ సంఖ్య పెరగాలి. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలి" వెంకట రమణారెడ్డి అన్నారు.

**పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇవ్వాలి: పాల్వాయి హరీశ్‌బాబు...** త్రీవీలర్, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వ ప్రోత్సహించాలని మరో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలంటే ఈవీలను వాడాలని చెప్పారు. వినియోగం పెరిగేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీ పాలసీ తీసుకొస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.




# సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ ఆరా

ఢిల్లీ , జనవరి 6: కాంగ్రెస్ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఇవాళ (మంగళవారం) అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడుతోండటంతో ఆమెను వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ఈ నేపథ్యంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరా తీశారు. ఏఐసీసీ పెద్దలకు ఫోన్ చేసి సోనియా గాంధీ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సోనియా ఆరోగ్యం నిలకడగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**అనారోగ్యానికి కారణం కాలుష్యమేనా..** కాగా, ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం.. సోనియా గాంధీకి సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో నెలకొన్న తీవ్ర వాయు కాలుష్యం కారణంగానే సోనియా గాంధీకి ఈ అనారోగ్య పరిస్థితి ఏర్పడినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

కాలుష్య స్థాయిలు పెరగడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచించారు.

**వైద్యుల పర్యవేక్షణలో చికిత్స..** వైద్యుల సూచనల మేరకు సోనియాగాంధీకి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా వైద్యులు గమనిస్తున్నట్లు సమాచారం.

కాగా గతంలోనూ సోనియాగాంధీ పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.

# ఆ అక్రమ నిర్మాణాలను తొలగించాలి.. సీఎం రేవంత్‌కి కిషన్‌రెడ్డి లేఖ

ఢిల్లీ, జనవరి 6 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇవాళ(మంగళవారం) లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా వరంగల్ కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించాలని సూచించారు. కోట భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కోట భూముల్లోని ఆక్రమణదారులను తొలగించడం గురించి ఈ లేఖలో ప్రస్తావించారు.దాదాపు 250 సంవత్సరాలపాటు కాకతీయుల రాజధానిగా కీర్తిగడించి ఘనమైన చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు (వరంగల్) పట్టణం.. తెలంగాణ వారసత్వ సంపదకు నిలయంగా విరాజిల్లుతోందని వ్యాఖ్యానించారు కిషన్‌రెడ్డి. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల నుంచి ఎదురయ్యే దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటం కోసం ఒక ప్రణాళిక ప్రకారం 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తానులు, హైదరాబాద్ నవాబుల దాడులను ఎదుర్కొన్న కోటని అభివర్ణించారు. నేటికీ కాకతీయుల శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ వేలాదిమంది పర్యాటకులు ఈ కోటను సందర్శించి కోటలో దాగి ఉన్న శిల్ప సంపద, నిర్మాణ నైపుణ్యం, వందలాది ఆలయాలు, వాటి నేపథ్యం, కోట ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్నారని వెల్లడించారు కిషన్‌రెడ్డి. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవలే సౌండ్, ఇల్యూమినేషన్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసిందని వివరించారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో ఉన్న వరంగల్ కోట పరిరక్షణకు, నిర్మాణాల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ వరంగల్ కోటకు చుట్టూ ఉన్న 7



ప్రాకారాల్లో ప్రస్తుతం 3 ప్రాకారాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు కిషన్‌రెడ్డి. ఈ 3 ప్రాకారాలతో పాటు ఇతర ప్రాకారాలను కొంతమంది స్థానికులు ఆక్రమించి కోట భూముల్లో అనేక అక్రమ కట్టడాలు నిర్మించారని వెల్లడించారు. వరంగల్ కోటꞏꞏ× అధీనంలో ఉన్న ఒక స్మారక ప్రదేశమని, దీనికి సంబంధించిన భూములను ఆక్రమించడం, అందులో అక్రమంగా నిర్మాణాలను నిర్మించడం చట్టరీత్యానేరమని చెప్పుకొచ్చారు. వెంటనే ఆక్రమించిన భూములను ఖాళీ చేయాలని కోరుతూ అధికారులు ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు కిషన్‌రెడ్డి. ఇదే విషయాన్ని తెలియజేస్తూ తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలోꞏꞏ× అధికారులు 04.11.2022న అలాగే, ఇటీవల 01.12.2025న వరంగల్ జిల్లా కలెక్టర్‌కి పలుమార్లు లేఖలు రాశానని గుర్తుచేశారు. తాను లేఖ రాసిన కోట భూములను పరిరక్షించటానికి వరంగల్ జిల్లా కలెక్టర్ ఎటువంటి చర్యలు ఎందకు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్: భట్టి విక్రమార్క

హైదరాబాద్: సింగరేణి కార్మికుల సంక్షమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. సింగరేణిపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. "32 మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలో భర్తీ చేస్తాం. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతోంది. సింగరేణి ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం. విశ్రాంత ఉద్యోగులు అక్కడ మందులు అందించేలా చర్యలు చేపడతాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.



# ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల పెంపునకు చర్యలు: పొన్నం

హైదరాబాద్ : భవిష్యత్ తరానికి మంచి జీవితాన్ని అందించడమే లక్ష్యంగా జీవో 41 ద్వారా ఈవీ పాలసీని తీసుకువచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం నాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈవీ పాలసీ, ఆర్టీసీకి సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. దీనిపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇచ్చారు. గడిచిన సంవత్సర కాలంలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుపోయాయని మంత్రి తెలిపారు. ఈవీలు గతంలో ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్ల రేంజ్ వచ్చేదని.. ఇప్పుడు 500 కిలోమీటర్లు ప్రయాణించే పాసిటీ వాహనాలు వచ్చాయని వివరించారు. ఈ పాసిటీని మరింత పెంచడానికి సమీక్షలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్‌లను పెంచానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు మంత్రి పొన్నం. ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారులు, డీలర్లతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఈవీలు గణనీయంగా పెరిగాయన్నారు. రెడ్కో సంస్థల ద్వారా ఛార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వాహనాలు, పాఠశాల బస్సులు, ఫార్మా, ఐటీ వాహనాలు 25- 50 శాతం వారి అవసరాలు బట్టి ఈవీ వాహనాలు కొనేలా విధానం తీసుకురాబోతున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చూస్తే అక్కడ గాలిలో ప్రమాదకరమైన బ్యాక్టరీయా ఉన్నట్లు తెలుస్తుందన్న మంత్రి.. హైదరాబాద్‌లో డిల్లీ లాంటి ప్రమాదకర పరిస్థితి రాకుండా ఉండడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవి పాలసీ ద్వారా ఈవి, CNG, LPG వాహనాల వినియోగం పెంచుతున్నామన్నారు. పీఎం ఈ -డ్రైవ్ కింద 2,800 బస్సులు



దశల వారీగా వస్తున్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు. వరంగల్ మున్సిపాలిటీకి 100, నిజామాబాద్ మున్సిపాలిటీ 50 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని మంత్రి పొన్నం ప్రకటించారు. మనం వాడే వాహనాలు కూడా ఈవిలు వాడేలా చూసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. అన్ని కలెక్టరేట్లలో, రెస్టారెంట్లలో, టూరిజం స్పాట్లలో ఛార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ బాగుండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. హైదరాబాద్‌లో 200 ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ దాటుతుందని.. ఢిల్లీలో 400 దాటిందన్నారు. కాలుష్య నివారణకు ప్లాంటేషన్ పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే ఈవిల వినియోగం పెంచాలని.. ఈవీల వినియోగంలో దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. రాబోయే తరానికి కాలుష్య రహిత తెలంగాణ అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్.

# 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పని చేస్తున్నాం: మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్లకు తీస్కుెళ్లాలనే దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు సులువుగా ఉండే విధంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ రైజింగ్ సదస్సులో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఈనెల 19న మరోసారి వరల్డ్ ఎకనమిక్ సమిట్‌కు వెళుతున్నామని, భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.






# కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యమేమీ లేదు: మల్‌రెడ్డి రంగారెడ్డి

హైదరాబాద్, జనవరి 6: ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి స్వీట్ వార్నింగ్ కూడా ఇచ్చారు. మరి ఇంతకీ ఆయన ఎందుకు అలా అన్నారు.. సొంత పార్టీకే ఎందుకు వార్నింగ్ ఇచ్చారు.. పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం నాడు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న కవిత ఎపిసోడ్‌పై స్పందించారు. కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారాయన. దానం నాగేందర్, కడియం శ్రీహరి తమ పార్టీలోకి వస్తారని ఊహించలేదని.. చివరికి వారు వచ్చారు కదా అని ఉదహరించారు మల్‌రెడ్డి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి కూడా చిన్నపాటి వార్నింగ్ ఇచ్చారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఎప్పటి నుంచో మంత్రి పదవి ఆశిస్తున్నారు. హైదరాబాద్ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని పలుమార్లు బహిరంగంగానే అడుగుతూ వచ్చారు. ఇప్పుడు కూడా అదే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం కలుగుతుందని పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీ పెద్దలు ఆలోచించాలని కోరారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న జిల్లాకు ఇంత వరకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. రంగారెడ్డి జిల్లా పేరు మార్పుపైనా ఆయన స్పందించారు. పేరు మార్పు తనకు ఇష్టం లేదన్నారు. రంగారెడ్డి జిల్లా పేరు మార్పు అనేది కేవలం ఊహాగానమే అని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చని.. జిల్లా స్వరూపం మాత్రం మారొద్దని ప్రభుత్వాన్ని మల్‌రెడ్డి కోరారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ భూమ్ పెరిగిందన్నారు. భూముల రేట్లు పెరుగుతున్నాయని భూములు ఎవరూ అమ్మడం లేదన్నారు. ఫార్మాసిటీపై పోరాటం చేసినందుకే గతంలో తనను కేసీఆర్ ఓడగొట్టారని మల్‌రెడ్డి చెప్పారు. నాటి ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం ఫార్మాసిటీ వచ్చి ఉంటే 50 కిలోమీటర్ల మేర పొల్యూషన్ అయ్యేదన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660